మూతబడింది

- రంజానాయక్ తండా పాఠశాల దుస్థితి
- రెండేళ్లుగా డిప్యుటేషన్‌పై టీచర్
- మరో పాఠశాలకు విద్యార్థుల వలస
- మంత్రి ఇలాకాలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

ఉన్న ఒక్క ఉపాధ్యాయురాలు సుమారు రెండేళ్లుగా డిప్యుటేషన్‌పై వెళ్లడంతో రంజానాయక్ తండా ప్రాథమిక పాఠశాల మూతపడింది. దీంతో విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఇక్కడి విద్యార్థులను బురాన్‌వాడీ తండా ప్రాథమిక పాఠశాలకు తరలించారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలికి అధికారుల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. శుక్రవారం 'సాక్షి' విజిట్‌లో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. – రేగోడ్(మెదక్)



మూతపడిన రంజానాయక్ తండా ప్రాథమిక పాఠశాల

మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 4, ప్రాథమిక పాఠశాలలు 22, ప్రాథమికోన్నత పాఠశాలలు 1, కస్తూర్బా బాలికల పాఠశాల 1, మోడల్ స్కూల్ 1 ఉన్నాయి. ఇందులో 1,921 మంది విద్యార్థులు చదువుతున్నారు. 13 పాఠశాలల్లో సింగిల్ టీచర్లు ఉండగా, రంజానాయక్ తండాలో సైతం సింగిల్ టీచర్ విధులు నిర్వర్తించారు. అయితే రెండేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో విద్యార్థులు తప్పని పరిస్థితిల్లో బురాన్‌వాడీ తండా ప్రాథమిక పాఠశాలకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. గత జూన్ నుంచి పాఠశాలకు తాళం వేసి ఉందని తండావాసులు చెబుతున్నారు.

38 పోస్టులు ఖాళీ

మండలంలో 29 పాఠశాలలకు గాను 131 ఉపాధ్యాయులు కావాల్సి ఉంది. అయితే ఇంకా 38 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంత్రి దామోదర రాజనర్సింహ సొంత నియోజకవర్గంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. మంత్రి గారు.. మా బడిని తెరిపించండి సారూ! అంటూ వేడుకుంటున్నారు. అదే విధంగా ఖాళీగా ఉన్న పోస్టులను సైతం భర్తీ చేయాలని కోరుతున్నారు.

బడిని తెరిపించాలి



మా తండా బడికి తాళం పడినా పట్టించుకునే వారు లేరు. నా కుమారుడిని రేగోడ్‌లోని ప్రాథమిక పాఠశాలకు రోజూ పంపించి తీసుకొస్తున్న. చాలా మంది పిల్లలను హాస్టల్‌లో వేశారు. ఇప్పటికైనా బడిని తెరిపించాలి.

– పీర్యానాయక్, రంజానాయక్ తండా

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రంజానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న సింగిల్ టీచర్ సుమారు రెండేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై వెళ్లారు. అక్కడి విద్యార్థులను బురాన్‌వాడీ తండా పాఠశాలకు పంపిస్తున్నాం. 29 పాఠశాలల్లో 131 ఉపాధ్యాయ పోస్టులకు గాను 38 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యను గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా.

– గురునాథ్, ఎంఈఓ, రేగోడ్

సామాజిక తనిఖీ పక్కాగా చేయాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్

కొడిపల్లి(నర్సాపూర్): ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ పక్కగా చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కొడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ కోసం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధిహామీ, పంచాయతీరాజ్, అటవీశాఖ ఆధ్వర్యంలో రూ 9కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం గ్రామాలలో తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఈసీ ప్రేమ్‌కుమార్, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ, డీఆర్పీ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

ప్రహరీలు లేక.. పరేషాన్

- సంక్షేమ హాస్టళ్లలో వసతులు కరువు
- పశువులు, పందుల సంచారం
- విద్యార్థులకు తప్పని తిప్పలు

శివ్వంపేట(నర్సాపూర్): సంక్షేమ హాస్టళ్లకు ప్రహరీ నిర్మాణాలు చేపట్టక పోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. సొంత భవనాలు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో వసతులు కల్పించలేదు. మండల కేంద్రమైన శివ్వంపేటలో ఎస్టీ బాలుర వసతిగృహం నిర్మించి 35 ఏళ్లు, దొంతిలో ఎస్సీ బాలుర వసతిగృహం నిర్మించి ఇరవై ఏళ్లు అవుతున్నా.. ప్రహరీలు నిర్మించ లేదు. దీంతో పశువులు, పందులు, బయటి వ్యక్తులు సైతం హాస్టళ్లలోకి వస్తున్నారు.

చెప్పకుండా వెళ్లిపోయిన విద్యార్థులు..

శివ్వంపేట హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో పలుమార్లు విద్యార్థులు వార్డెన్‌కు చెప్పకుండానే బయటకు వెళ్లిన ఘటనలు ఉన్నాయి. ప్రధాన గేటు ఉన్నప్పటికీ భవనం వెనుక భాగం ఖాళీగా ఉండడం వల్ల ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ హాస్టల్‌కు సంబంధించిన భూమి ఉన్నా గోడ నిర్మాణానికి స్థానికులు అడ్డుకోవడంతో ముందుకు సాగడంలేదు. సంబంధిత రెవెన్యూ అధికారులు హాస్టల్ భూమి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తే సమస్య తొలిగిపోనుంది.



ప్రహరీలేని శివ్వంపేట ఎస్టీ హాస్టల్

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా..

దొంతి హాస్టల్ భవనం ముందు నుంచి దొంతి–గుండ్లపల్లి ప్రధాన రోడ్డు ఉండటంతో పాటు ఆనుకుని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. ఇక్కడ రాత్రి వేళల్లో బయట వ్యక్తులకు మద్యం, సిగరెట్లు తాగడం, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. ప్రహరీ నిర్మిస్తే హాస్టల్, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలకు అనుకూలంగా ఉంటుంది. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యల గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వార్డెన్లు రాజ్‌కుమార్, యాదిగిరి తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీల నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

టెన్త్ ఫలితాలపై శ్రద్ధ ఏది?

- వివిధ సంఘాల కీలక పదవుల్లో పనిచేస్తున్న మండలంలోని టీచర్లు
- ప్రత్యేక తరగతుల్లేవు...అధికారుల పర్యవేక్షణ లేదు
- గతేడాది 50% ఉత్తీర్ణత కూడా దాటని వైనం

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులకు అత్యంత కీలకమైన పదో తరగతి ఫలితాలపై అటు ఉపాధ్యాయులు, ఇటు అధికారులు దృష్టి పెట్టడం లేదని మనోహరాబాద్ మండల వాసులు ఆరోపిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండటంతో తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించేవారే కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మండలంలోని ఉపాధ్యాయులు వివిధ సంఘాల్లో పనిచేస్తూ విద్యార్థులను గాలికివదిలేసి తమ యూనియన్ పనుల్లో నిమగ్నమైపోతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటివరకూ అవి మొదలు కాలేదు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాల్సి ఉండగా ఇంతవరకూ ఎంతమేరకు అమలు చేస్తున్నారో లేదో అధికారుల పర్యవేక్షణ కూడా లేకుండా పోయింది.

గతేడాది ఇదే తీరు....

గతేడాది కూడా ఉపాధ్యాయులు, అధికారులు ఇలాగే వ్యవహరించడంతో టెన్త్ ఫలితాల్లో మండలం కనీసం 50% ఉత్తీర్ణత సాధించలేకపోయింది. హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో మనోహరాబాద్ మండలం ఉండటంతో ఉపాధ్యాయులు పైరవీలతో మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు పోస్టింగ్ వేయించుకున్నారు. దాదాపు వీరంతా యూనియన్లలో కీలక పదవులు కలిగి ఉండటంతో వారి పూర్తి సమయాన్ని విద్యాబోధనపై వెచ్చించలేకపోతున్నారు. ఇక ఉపాధ్యాయులు యూనియన్ల పేరుతో గ్రూప్‌లుగా విడిపోయి విద్యార్థులకు పాఠాలు బోధించడంలో వెనుకబడ్డారని తల్లిదండ్రులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈసారైనా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధిస్తారేమోనని అటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు ఉండగా పదో ఫలితాలపై ఇప్పటినుంచి అయినా ప్రత్యేక దృష్టిపెడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. లేకుండా భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పర్కిబండ ఉన్నత పాఠశాల

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



పదో తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఏయే అంశాల్లో వెనుబడ్డారో పరిశీలించి వాటిపై పట్టుసాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. అప్పుడే పదవ తరగతి ఉత్తీర్ణతలో మంచి ఫలితాలు వస్తాయి.

–మస్తాన్, ముప్పిరెడ్డిపల్లి.

విద్యార్థులు కష్టపడాలి



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రణాళికాబద్ధంగా వారి చదువుకు కృషి చేయాలి. విద్యార్థులు కూడా తాము ఏయే సబ్జెక్టుల్లో బలహీనంగా ఉన్నామో వాటిపై శ్రద్ధ పెట్టి వారి సందేహాలను ఉపాధ్యాయులనుంచి అడిగి తెలుసుకోవాలి. విద్యార్థులు మరింత కష్టపడితేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయి.

–మహిపాల్‌యాదవ్, మనోహరాబాద్.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నిజాంపేట(మెదక్): నగరం గ్రామంలో పీఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ



వెల్దుర్తి(తూప్రాన్):మాసాయిపేటలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రామంలోని జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ ఉపాధ్యాయులతో పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ మేరకు మహిళ ఉపాధ్యాయురాలను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నిజాంపేట మండల ప్రధాన కార్యదర్శి రాందేవ్ వెంకటేశ్, మహిళా ఉపాధ్యక్షురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు కల్పన, స్వప్న, సోనా తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్)లో..

వెల్దుర్తి(తూప్రాన్): పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాసాయిపేట మండల వనరుల కేంద్రం వద్ద తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఎంఈఓ లీలావతి చేతుల మీదుగా ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. మాసాయిపేట మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం ధర్మపురి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాగారెడ్డి, హరిరంజన్‌శర్మ, శ్రీశైలం, కనకయ్య, బాలమణి, దయాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ఉన్నా మరోచోట సమావేశాలా..?

అల్లాదుర్గం(మెదక్): ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్యాలయం ఒక మండలంలో ఉంటే, సమావేశాలు మరో మండలంలో నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. ప్రభుత్వం అల్లాదుర్గంలో సీడీపీఓ కార్యాలయం ఏర్పాటు చేసిందని, తొమ్మిదేళ్లుగా అల్లాదుర్గంలో ప్రాజెక్టు సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే ఇటీవల బదిలీపై వచ్చిన సీడీపీఓ ప్రాజెక్టు సమావేశాలు అల్లాదుర్గంలో కాకుండా పెద్దశంకరంపేటలో నిర్వహిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయన చెప్పారు. ఉచిత భవనం వదిలి, చిన్న అద్దె ఇంట్లో సీడీపీఓ కార్యాలయం నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టు కార్యాలయం ఎందుకు ఏర్పాటు చేశారని, కార్యాలయాన్ని కూడా తరలిస్తారా అని ప్రశ్నించారు. మరోసారి ఇతర మండలాల్లో ప్రాజెక్టు సమావేశాలు నిర్వహిస్తే, మంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా సావిత్రిబాయి జయంతి వేడుకలు

సావిత్రిబాయి పూలె జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. సావిత్రిబాయి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు వక్తలు పేర్కొన్నారు.



హవేళఘణాపూర్: ఎంజేపీ బాలికల పాఠశాలలో..



టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో..



పెద్దశంకరంపేటలో..



మనోహరాబాద్: కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో..



వెల్దుర్తిలో ..



నర్సాపూర్‌లో..



అల్లాదుర్గం: ముస్లాపూర్ పాఠశాలలో..



చిన్నశంకరంపేటలో..



కొడిపల్లి ఉన్నత పాఠశాలలో ..



పాపన్నపేటలో ..

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ పుష్పవేణి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబుగౌడ్, నరేష్ కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు దీప్లారాథోడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నార్సింగిలో తపస్ ఆధ్వర్యంలో...

నార్సింగి లో తపస్ క్యాలెండర్‌ను ఎంఈఓ మురళిమోహన్ ఆవిష్కరించారు. తపస్ మండల అధ్యక్షులు స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ పుష్పవేణి

క్లుప్తంగా

డీసీసీబీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీసీసీబీ సిబ్బంది

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మంభోజిపల్లి డీసీసీబీ బ్యాంకులో మేనేజర్ ప్రమోద్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం డీసీసీబీ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఖాతారులకు మెరుగైన సేవలందించేందుకు గాను తమ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో అర్హత కలిగిన రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘాల అధ్యక్షులు మనోహర్, ప్రభాకర్, మల్లేశంగౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల మరణించిన మెదక్ పట్టణ పోలీస్ కానిస్టేబుల్ దుర్గపతి కుటుంబానికి పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీ నుంచి రూ. 16 లక్షల చెక్కు మంజూరు కాగా, చెక్కును జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధిత కుటుంబానికి శుక్రవారం ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని 15వ వార్డులో ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం 15వ వార్డు కౌన్సిలర్ లలిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈసందర్భంగా లలిత మాట్లాడుతూ.. 15వ వార్డులో ఇప్పటికే అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన పనులను మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10 లక్షలతో పూర్తి చేస్తున్నామని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

కొండపాక(గజ్వేల్): మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ కోరారు. కుకునూరుపల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవం దెబ్బతినకుండా, సమస్యల పరిష్కారం కోసం సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 5న గజ్వేల్‌లో ఉన్న పీఎస్ఆర్ గార్డెన్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం పార్టీలకు, సంఘాలకు అతీతంగా మాదిగ ఉపకులాల సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ, ప్రొఫెసర్ ఖాసీం, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్నలతో పాటు మరికొందరు ముఖ్యులు హాజరవుతారన్నారు. పెద్ద సంఖ్యలో మాదిగలు హాజరై సమావేశం విజయవంతం అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, బాబు, మధు, కరుణాకర్, భాస్కర్, కనకరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మెదక్ మున్సిపాలిటీ: గుర్తు తెలియని వ్యక్తులకు డబ్బులు పంపొద్దని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా మెదక్ పట్టణ సీఐ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల మెదక్ పట్టణంలో సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసుకున్న వివరాలను వెల్లడించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్లతో మోసపోయిన వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. వారి డబ్బు రికవరీ చేసే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను నమ్మకూడదని సూచించారు.

మర్యాదపూర్వక కలయిక

సిద్దిపేటకమాన్: మంత్రి దామోదర రాజనర్సింహను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట ప్రధాన కార్యదర్శి మార్క సతీశ్‌కుమార్ హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సుధీర్‌కుమార్, రోహిత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని రామంతాపూర్ తాండ, అచ్చంపేట, రామంతాపూర్, మాసాయిపేట, లింగారెడ్డిపల్లి గ్రామాల్లోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **చెక్ డ్యాం నిర్మాణంపై సమావేశం**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లి గ్రామ శివారులో చెక్ డ్యాం నిర్మాణంపై గ్రామీణాభివృద్ధి సామాజిక కార్యక్రమం జలశక్తి అభియాన్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల కోరిక మేరకు చెక్ డ్యాం నిర్మాణం వల్ల కలిగే ఉపయోగాలను సంస్థ ప్రతినిధులు వివరించారు. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్మాణం చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, పోతిరెడ్డి, శ్రీనివాస్, సిద్ధిరాంరెడ్డి, అంజిరెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

◆ **బీసీగర్జనకు తరలిన నాయకులు**

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన బీసి గర్జనకు మనోహరాబాద్ మండల నాయకులు శుక్రవారం భారీగా తరలివెళ్లారు. మండల బీఆర్ఎస్ నాయకులు దాసరి నరేష్, భిక్షపతి, నాగభూషణం, భాషా, కుంట రాజు, తదితరుల ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు.

◆ **గౌడ జనుల పోరాట సమితి అధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్**

పాపన్నపేట(మెదక్): మండల గౌడ జనుల పోరాట సమితి అధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్ ఎన్నికయ్యారు. శుక్రవారం పాపన్నపేటలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా ప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్‌గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా మచ్చేందర్‌గౌడ్, కార్యదర్శిగా సాయిబాబగౌడ్, కోశాధికారిగా సాయిప్రశాంత్ గౌడ్ ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రందుర్గాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా శంకర్**

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లికి చెందిన శివగారి శంకర్‌ను ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా నియమించినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మురళి మాదిగ తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని ఆయన స్పష్టం చేశారు.

◆ **రూ.2 లక్షల ఎల్‌ఓసీ అందజేత**

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం లక్ష్మీనగర్‌కు చెందిన భోగ ఆనంద్‌కు ఆపరేషన్ నిమిత్తం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శుక్రవారం రూ.2 లక్షల ఎల్‌ఓసి మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. న్యూరో సంబంధమైన ఆపరేషన్ కోసం ఆయన ఎల్‌ఓసి ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు నాని, సుబ్బారావు తెలిపారు.

◆ **జక్కాపూర్ విద్యార్థుల ప్రతిభ**

సిద్దిపేటరూరల్: మాసపత్రిక గడుగ్గాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి 2025 కథలు, కవితలు, వ్యాసాల పోటీలలో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు షౌకత్ అలీ శుక్రవారం తెలిపారు. కెనడా దేశ కేంద్రంగా ప్రపంచంలోని తెలుగు విద్యార్థులందరికీ ఈ పోటీలు గత నెలలో నిర్వహించారు. అందులో కే విశిష్ట , పీ మధుహాసిని, కే హర్షవర్ధన్, కే అభిషేక్‌లు, కే సౌమ్య ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ **ఇందిరమ్మ సర్వేకు సహకరించాలి**

గజ్వేల్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రజలు సహకరించాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలమున్న వారికి రూ. 5లక్షల ఆర్థిక లబ్ధి పొందేందుకు అర్హులైన వారు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.